

కల్యాణ మండపాల నిర్మాణానికి..

నియోజకవర్గంలోని కల్యాణ మండపాల నిర్మాణానికి సహాయం అందిస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ పేర్కొన్నారు.

- 9లో ▸



అమ్మ దయతో వర్షాలు

ఎల్లమ్మ, పోచమ్మల దయతో ఈసారి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం

34.0 /23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిరూరల్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను పార్ట్‌టైం ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఆయా పోస్టులకు అర్హులైనవారినుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎల్లారెడ్డి, ఉప్పల్‌వాయి, భిక్కనూరు, అచ్చంపేట, తాడ్కోల్, బోర్లం, తాడ్వాయి, లింగంపేట, ఎక్లారా, పెద్దకొడప్‌గల్, దోమకొండ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు తిరంగా ర్యాలీ

మద్నూర్: మండల కేంద్రంలోని రథ్‌గల్లీ నుంచి పాత బస్టాండ్ వరకు సోమవారం వెయ్యి అడుగుల జాతీయ పతాకంతో తిరంగా ర్యాలీ నిర్వహించనున్నారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన సైనికులకు సంఘీభావంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని మద్నూర్‌వాసులు తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలన్నారు.

వడ్లను త్వరగా రైస్ మిల్లుకు పంపాలి



లింగంపేట: వడ్ల బస్తాలను తొందరగా రైస్ మిల్లులకు పంపాలని ఐకేపీ డీపీఎం సురేష్ సూచించారు. ఆదివారం ఆయన అయిలాపూర్‌లోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడా ధాన్యం బస్తాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సురేందర్



కామారెడ్డి రూరల్: జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎల్లారెడ్డికి చెందిన నాగం సురేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా మాజీ అధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు గౌరిశెట్టి రాజు ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ సాగింది. కార్యక్రమంలో సంఘం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, ప్రతినిధులు రామచంద్రం, సుభాష్, రమేష్ దేశాయ్, లక్ష్మీరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ జాగరణ్ మంచ్ జిల్లా ప్రముఖ్‌గా శైలజ



శైలజ



రాజేశ్వర్ గౌడ్

కామారెడ్డి అర్బన్: స్వదేశీ జాగరణ్ మంచ్ జిల్లా ప్రముఖ్‌గా మండల శైలజ, జిల్లా కోకన్వీనర్‌గా రాజేశ్వర్‌గౌడ్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన స్వదేశీ జాగరణ్ మంచ్ తెలంగాణ ప్రాంత కార్యసమితి సమావేశాల్లో ఈ నియామకాలు జరిగినట్టు మంచ్ రాష్ట్ర యువ ప్రముఖ్ వంగ రాహుల్ తెలిపారు. కామారెడ్డి జిల్లాలో స్వదేశీ జాగరణ్ మంచ్ కార్యక్రమాలను మరింతగా విస్తృతం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

హోటల్‌లో అగ్ని ప్రమాదం



ఖలీల్‌వాడి: నిజామాబాద్ బస్టాండ్ సమీపంలో ఉన్న సాయి మెస్ టిఫిన్ సెంటర్‌లో ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. టిఫిన్ సెంటర్ కిచెన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఫైరింజన్లు మంటలార్పాయి. ఘటన సమయంలో టిఫిన్ సెంటర్‌లో కస్టమర్లు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే పక్కనే ఉన్న టిఫిన్ సెంటర్‌ను మూసివేయడంతోపాటు పైఅంతస్తులోని మెస్, లాడ్జీలో ఉన్న వారిని ఖాళీ చేయించారు.

సాగుకు సన్నద్ధం!



విత్తనాలు వేస్తున్న రైతు

రోహిణికి ముందే కురిసిన వర్షాలు

- కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే దుక్కులు సిద్ధం
- విత్తనాల కొనుగోళ్లలో రైతులు బిజీ బిజీ
- కాలం అనుకూలిస్తే విత్తనాలు వేసేందుకూ రెడీ

నైరుతి రుతుపవనాలు రాకముందే కురిసిన వర్షాలతో వానాకాలం పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మెట్ట ప్రాంతాల్లో ఇప్పటికే వేసవి దుక్కులు దున్ని పెట్టిన రైతులు.. కాలం అనుకూలిస్తే రోహిణి కార్తెలోనే విత్తనాలు వేయడానికి రెడీ అవుతున్నారు. విత్తనాల కొనుగోళ్లలో బిజీగా ఉన్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లావ్యాప్తంగా నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆశలు చిగురించాయి. రుతుపవణాలు కూడా ముందుగానే వస్తున్నాయన్న వార్తలతో ముందస్తుగా విత్తనాలు వేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సాధారణంగా రోహిణీ కార్తెలో ఎండలు తీవ్రంగా ఉంటాయి. అయితే ఈసారి అందుకు విరుద్ధంగా వాతావరణం ఉంది. రోహిణి కార్తె ఆదివారం ప్రవేశించింది. జిల్లా అంతటా వాతావరణం మేఘావృతమై ఉంది. రుతుపవనాలు రేపో, ఎల్లుండో రానున్నాయని, దీని ప్రభావంతో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని చెబుతుండడంతో రైతులు రోహిణి కార్తెలో విత్తనాలు వేయడానికి సిద్ధమవుతున్నారు.



పొలం బాట పట్టిన రైతులు...

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రైతులు పొలం బాట పట్టారు. చేలో ఉన్న చెత్త, చెదారాన్ని ఏరి కుప్పగా పోసి కాల్చివేస్తున్నారు. అలాగే పశువులు ఉన్న రైతులు పశువుల పేడను చేలకు తరలిస్తున్నారు. బోర్లు, బావులు ఉన్న రైతులు మోటార్లకు మరమ్మతులు చేయించి సిద్ధం చేస్తున్నారు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు పంట చేల వద్దకు వెళ్లి ఏదో ఒక పనిలో నిమగ్నమవుతున్నారు. వరుసగా వర్షాలు కురవడంతో నేల తడిగా మారింది. కొంత ఎండతగిలితే ట్రాక్టర్లతో దున్నకాలు చేపట్టేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇదే సమయంలో పంటల సాగుకు అవసరమైన విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు విత్తనాలు కొనుగోలు చేశారు. రోహిణి కార్తెలో విత్తనం వేయడానికి చాలా మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ముందస్తుగానే..

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు దుక్కులు సిద్ధం చేసి పెట్టారు. రోహిణి కార్తె కూడా ప్రవేశించిన నేపథ్యంలో మంచి రోజు చూసి విత్తనం వేయాలని భావిస్తున్నారు. ఎండల తీవ్రత తగ్గడంతో పాటు వర్షాలు కూడా కురుస్తుండడంతో కాలం అనుకూలంగా ఉందని రైతులు భావిస్తున్నారు. దీనికి తోడు రుతుపవనాలు ముందుగానే వస్తున్నాయని చెబుతుండడంతో ఇబ్బందులు తప్పినట్టేనని పేర్కొంటున్నారు. దీంతో ఈసారి వానాకాలంలో ముందస్తుగానే పంటలు సాగయ్యే అవకాశాలు ఉన్నాయి.

మెట్ట ప్రాంతాల్లో ఆరుతడి పంటల సాగు

భూగర్భ జలాలపై ఆధారపడి సేద్యం చేసే ప్రాంతాలతో పాటు నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాలా ప్రాజెక్టుల కింద వరి సాగవుతుంది. మెట్ట ప్రాంతాలన్నింటా మక్క, సోయా, పత్తి, పప్పు దినుసులు వంటివి సాగు చేస్తారు. జుక్కల్ ప్రాంతంలో ఆరుతడి పంటలే ఎక్కువగా సాగు చేస్తారు. ప్రధానంగా సోయా, పత్తి, మక్క, పెసర, మినుము, కంది పంటలు సాగవుతాయి. జుక్కల్, పెద్దకొడప్‌గల్, మద్నూర్, పిట్లం, డోంగ్లీ, బిచ్కుంద మండలాల్లో ఇప్పటికే వేసవి దుక్కులతో రైతులు వానాకాలం పంటల సాగుకు భూమిని సిద్ధం చేసి పెట్టారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజక వర్గాల్లోని గాంధారి, లింగంపేట, తాడ్వాయి, రాజంపేట, సదాశివనగర్, మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట, రామారెడ్డి మండలాల్లోని మెట్ట ప్రాంతాల్లో ఆరుతడి పంటలు, బోర్లు, బావుల కింద వరి నాట్లు వేస్తారు. నిజాంసాగర్, పోచారం ప్రాజెక్టుల కింద నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, నిజాంసాగర్, బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లో వరి ఎక్కువగా సాగవుతుంది. ప్రాజెక్టుల నీరు వెళ్లని ప్రాంతాల్లో కూడా రైతులు బోర్లపై ఆధారపడి వరి సాగవుతుంది.

మొరాయిస్తున్న తూము షటర్లు

- ఖాళీ అవుతున్న పాత చెరువు నీరు
- ఆందోళన చెందుతున్న రైతులు

నిజాంసాగర్: వరుణుడు కరుణిస్తున్నా.. చెరువులో నీరు నిల్వ ఉండని పరిస్థితి నెలకొనడంతో నర్వ, అన్నాసాగర్ గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. తూములకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామ శివారులో గల పాత చెరువు కింద 456 ఎకరాల ఆయకట్టు ఉంది. అన్నాసాగర్, నర్వ గ్రామాల మధ్య పాత చెరువు ఉండడంతో కుడి, ఎడమ వైపులా రెండు తూములు ఏర్పాటు చేశారు. అయితే గతంలో మిషన్ కాకతీయ పథకం కింద పాత చెరువును బాగు చేయగా తూముల షటర్లు నాసిరకంగా బిగించారు. దీంతో వర్షాకాలంలో వరద నీటి ప్రవాహం ధాటికి చెరువుకు రెండు వైపులా ఉన్న తూముల షటర్లు కిందకు దిగడం లేదు. అవసరమైనప్పుడు వెంటనే పైకి కూడా లేవడం లేదు. రైతులు నానా తంటాలు పడుతూ తూములను పైకి ఎత్తుతున్నారు. యాసంగి సీజన్‌లో ఇలా కష్టపడి లేపిన షటర్లు కిందికి దిగడం లేదు. అంతేకాకుండా అన్నాసాగర్ వైపు ఉన్న తూము షటర్ మాయమయ్యింది. దీంతో పాత చెరువు రెండు తూముల ద్వారా నీరు వృథాగా వెళ్తోంది. వర్షాలతో చెరువులోకి కొత్త నీరు వచ్చి చేరుతున్నా నీరు నిలవడం లేదు. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. షటర్ల విషయాన్ని నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల తూములకు అవసరమైన మరమ్మతులు చేపట్టి, నీరు నిల్వ ఉండేలా చూడాలని కోరుతున్నారు.



తూము షటర్ లేక వృథాగా వెళ్తున్న నీరు



పాత చెరువు తూములో కిందికి దిగని షటర్

మేకుఎన్ ఐడియా సర్‌జీ!

- కోతి చేష్టలకు మేకు విరుగుడు

బీబీపేట(కామారెడ్డి): కోతులు తమ సహజమైన చేష్టలతో కిష్కింధకాండ సృష్టిస్తుంటాయి. పంటల నుంచి ఇళ్ల వరకు అన్నింటికి నష్టం చేకూరుస్తుంటాయి. వాటి బాధ తప్పించుకోవడానికి ప్రజలు రకరకాల ఏర్పాట్లు చేసుకుంటుంటారు. కోతుల బాధ తప్పించుకోవడానికి బీబీపేటకు చెందిన నర్సింలు కొత్త ఆలోచన చేశాడు. ఆయన ఇంటికి డీటీహెచ్ కనెక్షన్ ఉంది. కోతులు తరచూ డిష్ యాంటెన్నా పైకి దూకుతుండడంతో సెట్టింగ్ పోతోంది. దీంతో రిపేర్ చేయించడానికి వందలాది రూపాయలు ఖర్చు అవుతున్నాయి. ఈ సమస్యనుంచి బయటపడడానికి నర్సింలు ఓ ఆలోచన చేశాడు. డిష్ యంటెన్నా చుట్టూ సైకిల్ సైకిల్ టైర్ చుట్టి మేకులు కొట్టాడు. సిగ్నల్ రిసీవర్ వద్ద కూడా ఇలాగే చేశాడు. డిష్ మధ్యలోనూ మేకులు కొట్టాడు. కోతులు దూకితే మేకులు గుచ్చుకునేలా వాటిని అమర్చాడు. ఇది సత్ఫలితాలు ఇస్తోంది. కోతులతోపాటు రిపేర్ల బాధ తప్పిందని నర్సింలు పేర్కొంటున్నాడు.



బీబీపేటలో కోతులు రాకుండా డిష్ యాంటిన్నాకు కొట్టిన మేకులు

అధికారుల నిర్లక్ష్యం..

ఇంటర్ విద్యార్థినికి నష్టం

- పరీక్ష ఫీజు చెల్లించకపోవడంతో రాని హాల్‌టికెట్

నిజామాబాద్ అర్బన్ : మోడల్ స్కూల్ అధికారుల నిర్లక్ష్యంతో ఓ విద్యార్థిని విద్యా సంవత్సరాన్ని కోల్పోయింది. మాక్లూర్ మండలం వల్లభాపూర్ గ్రామానికి చెందిన వర్ష నవీపేట మోడల్ స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇంటర్‌లో గణితం సబ్జెక్టుకు సంబంధించిన సప్లిమెంటరీ ఫీజును చెల్లించింది. కానీ మోడల్ స్కూల్ అధికారులు ఆ ఫీజును బోర్డుకు చెల్లించలేదు. దీంతో పరీక్షలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థినికి హాల్ టికెట్ రాలేదు. ఇదే విషయాన్ని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌ను ప్రశ్నించగా పొరపాటు జరిగిందని, అధికారులను కలిసి సమస్య పరిష్కరిస్తామన్నారు. కానీ వర్ష ఈ ఏడాది పరీక్షలు రాసే అవకాశం కోల్పోయింది. అధికారుల నిర్లక్ష్యంతో తమ కూతురు ఒక విద్యా సంవత్సరం నష్టపోయిందని, తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై డీఈవో అశోక్‌ను వివరణ కోరగా తన దృష్టికి రాలేదని, పరిశీలిస్తామని తెలిపారు.

ట్రాన్స్‌కో.. మేలుకో!

బిచ్కుంద: మండల కేంద్రంలోని పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ప్రమాదం పొంచి ఉంది. గ్రామ పంచాయతీ వెనకనున్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ మురికి నీరు నిల్వ ఉండగా.. కోర్టు సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు పిచ్చి మొక్కలు పెరిగాయి. ఆయా ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద ఎలాంటి రక్షణ కంచెలు లేవు. గతంలో మండలకేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలి ఓ మహిళ మృతి చెందింది. మూగ జీవాలు సైతం మృత్యువాతపడుతున్నాయి. అయినా అధికారులు స్పందించడం లేదు. ఈ విషయాన్ని ఏఈ పవన్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా.. కొన్ని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదం పొంచి ఉన్నట్లు గుర్తించామన్నారు. జీపీ వెనక ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రాంతానికి మారుస్తామని, రక్షణ కంచెలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.



బిచ్కుంద జీపీ వెనక మురికి నీటిలో ట్రాన్స్‌ఫార్మర్



బిచ్కుంద కోర్టు వద్ద రక్షణ లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

రైతుపై పచ్చిరొట్ట భారం



జీలుగ పంట

- అమాంతం పెరిగిన ధరలు
- 30 కేజీల జీలుగ బస్తా రూ. 2,137
- గతేడాది బస్తా ధర రూ. 1,116

బాన్సువాడ రూరల్: భూసారం పెంచేందుకు ప్రభుత్వం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించిన విత్తనాలు అందిస్తోంది. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడం కోసం ప్రభుత్వం పచ్చిరొట్ట ఎరువులను ప్రోత్సహిస్తోంది. అయితే ఈసారి ధరలను అమాంతం పెంచడంతో రైతులపై అదనపు భారం పడుతోంది.

వరి సాగుకు నెలరోజుల ముందు జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువుల సాగుకు సంబంధించిన విత్తనాలను భూమిలో చల్లుతారు. ఏపుగా పెరిగిన తర్వాత 35 నుంచి 40 రోజుల మధ్యలో భూమిలో కలియ దున్నుతారు. దీంతో ఎకరాకు 5 టన్నుల వరకు ఎరువు తయారవుతుందని వ్యవసాయ అధికారులు చెబుతారు. ఇందులో 8 కిలోల భాస్వరం, 20 కేజీల పొటాష్, 35 కేజీల నత్రజని ఉంటుందని అధికారులు పేర్కొంటారు.

నాట్లపై ప్రభావం?

వరి సాగుకు నెలరోజుల ముందే పచ్చిరొట్ట సాగు చేయాల్సి ఉంటుంది. సాధారణంగా మే 15 వరకు జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువుల సాగుకు సంబంధించిన విత్తనాలను భూమిలో చల్లుతారు. కానీ ఈసారి కొంత ఆలస్యంగా విత్తనాలు రావడంతో రెండు రోజుల క్రితం పంపిణీ ప్రారంభించారు. దీంతో రోహిణి కార్తెలో పోయాల్సిన నార్లు పక్షం రోజులు ఆలస్యం అయ్యే అవకాశాలున్నాయి.

బస్తాపై వెయ్యికిపైనే..

ఎకరాకు 15 కేజీల వరకు విత్తనాలు అవసరం అవుతాయి. కాగా గతంలో 60 శాతం సబ్సిడీ అందించగా.. ఈసారి దానిని 50 శాతానికి తగ్గించారు. అంతేకాకుండా ధర సైతం భారీగా పెంచారు. గతేడాది 30 కేజీల జీలుగ విత్తనాల బస్తా ధర రూ. 1,116 ఉండగా ఈసారి రూ. 2,137 కి చేరింది. అంటే రైతులపై ఒక బస్తాకు రూ. 1,021 అదనపు భారం పడుతోందన్న మాట. అలాగే పిల్లి పెసర 20 కేజీల బస్తా ధర రూ. 1,084 నుంచి రూ. 2,055 కు పెరిగింది. జనుము 40 కేజీల బస్తా ధర గతేడాది రూ. 1,448 ఉండగా ఈసారి రూ. 2,510 కు చేరింది. దీంతో రైతులపై అదనపు భారం పడుతోంది. ధరలు తగ్గించాలని రైతులు కోరుతున్నారు.

చదువుకు పేదరికం అడ్డుకావొద్దు



మాట్లాడుతున్న జేటీసీ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్

- విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు వెళ్లాలి
- హైదరాబాద్ జేటీసీ చంద్రశేఖర్ గౌడ్

రుద్రూర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్, రైడ్స్ గౌరవ అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ ఉద్బోధించారు. మండల కేంద్రంలో రుద్రూర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషనల్ సొసైటీ (రైడ్స్) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నెల రోజులపాటు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ పేదరికం చదువుకోవడానికి అడ్డం కావొద్దని, అలాంటి వారికి రైడ్స్ చేయూత అందిస్తుందన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులకు సహకారం అందిస్తుందని, అందుకు మామిండ్ల రామాగౌడ్ స్మారక ట్రస్ట్ తోడ్పాటునందిస్తుందని తెలిపారు. విశిష్ట అతిథిగా హాజరైన బోధన్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శేషతల్ప సాయి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైడ్స్ సభ్యుల ప్రోత్సాహాన్ని వినియోగించుకొని ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో రుద్రూర్, వర్ని ఎంఈవోలు కట్ట శ్రీనివాస్, డీ సాయిలు, సీనియర్ న్యాయవాది వెంకటేశ్వరరావ్ దేశాయ్, మాజీ సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, ఇందూరు, వంశీ విద్యా సంస్థల అధినేతలు కిశోర్ కుమార్, పద్మజ, రైడ్స్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్యాంకర్లతో నీటి సరఫరా



నీటిని పట్టుకుంటున్న కాలనీవాసులు

పిట్లం: పిట్లం జీపీ పరిధిలోని పలు కాలనీల్లో ట్యాంకర్ల ద్వారా జీపీ సిబ్బంది నీటిని సరఫరా చేస్తున్నారు. జీపీ కార్యదర్శి బల్‌రాం మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలోని రాజీవ్‌గాంధీ కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. దీంతో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే బుడజంగం, ఎస్సీ కాలనీలో సైతం నీటి ఎద్దడి ఉండటంతో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించినట్లు తెలిపారు.

ఎల్లారెడ్డిలో తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో బీజేపీ నాయకులు ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో ర్యాలీ నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నీలం చిన్న రాజులు, బాణాల లక్ష్మారెడ్డి, బాపురెడ్డి, రాంరెడ్డి, నేరేళ్ల ఆంజనేయులు, రవీందర్‌రావు, నర్సింలు, రాజేశ్, దేవేందర్, బాలకిషన్, నక్క గంగాధర్, ప్యాలాల రాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీజవాన్‌కు సన్మానం



ఆర్మీ జవాన్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు ఆర్మీ జవాన్ క్యాస దేవేందర్‌ను ఆదివారం సన్మానించారు. ఎల్లారెడ్డిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆపరేషన్ సిందూర్ కార్యక్రమంలో భాగంగా చైనా బార్డర్‌లో విధులు నిర్వర్తించి ఇటీవల స్వగ్రామమైన సోమార్‌పేట్‌కు వచ్చిన దేవేందర్‌ను వారు శాలువాతో సన్మానించారు. జై భారత్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, నేరేళ్ల ఆంజనేయులు, బాపురెడ్డి, రాంరెడ్డి, నర్సింలు, రాజేశ్, దేవేందర్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

సంతలో కూరగాయల కొరత

భిక్కనూరు: మండల కేంద్రంలో నిర్వహించే వారాంతపు సంతలో కూరగాయల కొరత ఏర్పడింది. రామేశ్వర్‌పల్లిలో బోనాల పండుగను ఆదివారం నిర్వహించినందున ఆగ్రామానికి చెందిన రైతులు అంగడికి రాలేదు. ప్రతి వారం ఆ గ్రామానికి చెందిన రైతులు అధిక సంఖ్యలో భిక్కనూరు సంతకు వచ్చి కూరగాయలను విక్రయిస్తుంటారు. ఈ ఆదివారం వారు రాకపోవడంతో కూరగాయల కొరత ఏర్పడింది. దీంతో సంతకు వచ్చిన కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు.

ప్రభుత్వ బడికోసం ఏకమైన ఊరు

- పిల్లలను ప్రైవేటు పాఠశాలకు పంపించేది లేదని గ్రామస్తుల నిర్ణయం
- చేయిచేయి కలుపుతూ ఐక్యంగా ముందడుగు



బడి బాట నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)



క్యాసంపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

కామారెడ్డి రూరల్: ప్రభుత్వ పాఠశాలలను చిన్న చూపు చూస్తున్న ఈ రోజుల్లో తమ పిల్లలను సర్కార్ బడికే పంపాలని నిర్ణయించుకొని అందరికి ఆదర్శంగా నిలిచారు కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామస్తులు. తమ గ్రామానికి చెందిన పిల్లలు ప్రైవేటు బడికి పంపకుండా సర్కార్ బడికి పంపాలని తీర్మాణం చేశారు. గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల బాధ్యతను గ్రామస్తులంతా తమ భుజాలపై వేసుకున్నారు. తాము ప్రభుత్వ బడిలోనే చదివి ప్రయోజకులమయ్యాం కాబట్టి మా పిల్లలను కూడా ప్రైవేట్ స్కూల్‌కి పంపకుండా, ప్రభుత్వ బడిలోనే చదివిస్తామని నిర్ణయం తీసుకున్నారు. నలుగురు ప్రభుత్వ టీచర్స్‌తో పాటు కొత్తగా ఇద్దరు విలేజ్ వలంటీర్లను, ఒక ఆయాను, ప్రస్తుతం ఉన్న టీచర్స్‌కు అనుసంధానం చేస్తూ బడిని బాగు చేశారు. ప్రస్తుతం నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం లో బోధన జరుగుతోంది. గ్రామస్తులు దాతల సహకారంతో దాదాపు రూ. 7 లక్షల వరకు కొత్తగా మూడు గదుల నిర్మాణంతో పాటు డ్యూయల్ బెంచీలు, ఫ్యాన్స్, కరెంట్, రూమ్‌కి రంగులు, డిజైన్‌లు, నేమ్ బోర్డులు ఏర్పాటు చేయడానికి సంకల్పించారు. ఇంకా బడిలో కావాల్సిన అవసరాల కోసం, ఫ్యాన్లు, బెంచీలు, అదనపు తరగతి గదులు, వాటికి రంగురంగుల బొమ్మలు, ఇతర ఖర్చులకు రూ. 3 లక్షలు అవుతాయని అంచనా వేశారు. వాటిని చందాలు వేసి సేకరించేందుకు పాఠశాల యాజమాన్యంతో కలిసి ప్రణాళిక సిద్ధం చేశారు. ఉన్న టీచర్లకు అనుసంధానంగా మరో ఇద్దరు వలంటీర్లను జత చేసి ఇంగ్లీష్ మీడియం బోధించే దిశగా చర్యలు చేపట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. మన బడి మన బాధ్యత అంటూ ప్రభుత్వ పాఠశాలకు మద్దతుగా నిలిచిన తీరు మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. గతేడాది స్కూల్‌లో 27 మందే ఉండగా ఈసారి 132 మంది అయ్యారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా ఈ సంఖ్యను 200 చేర్చేందుకు గ్రామస్తులు నిర్ణయం తీసుకున్నారు. గ్రామస్తులు కుర్మిండ్ల ప్రభాకర్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, భూపతి, సంగి రాజు తదితరులు స్కూల్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ బడిలోనే చదివాం



తాము ప్రభుత్వ బడిలోనే చదివి ప్రయోజకులమయ్యాం. మా పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించేలా ఊరంతా కలిసి నిర్ణయం తీసుకున్నాం. చందాలు వసూలు చేసి మూడు అదనపు తరగతి గదులు, రంగులు, బెంచీలు, వలంటీర్లను ఏర్పాటు చేశాం.

– కుర్మిండ్ల ప్రభాకర్‌గౌడ్, క్యాసంపల్లి

పాఠశాల అభివృద్ధి కోసం



తాము చదివిన పాఠశాలను అభివృద్ధి చేయాలని ఊరంతా సంకల్పించాం. పాఠశాలలోని సమస్యలను పరిష్కరించడంతోపాటు మెరుగైన విద్యనందించేందుకు సౌకర్యాలు కల్పించాం. నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు ఉంది. మరింత జాయిన్ అయ్యేలా చేస్తాం.

– సందిరి రాజిరెడ్డి, క్యాసంపల్లి

కార్పొరేట్ పాఠశాలకు దీటుగా..



పాఠశాలలో గతంలో 27 మంది విద్యార్థులే ఉండేవారు. పాఠశాలను బాగుచేసుకుని కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పించాలని సిద్ధించాం. చందాలు వేసి పాఠశాలను కార్పొరేట్‌స్థాయిలో తీర్చిదిద్దాం. ప్రస్తుతం 132 మంది విద్యార్థులు చేరారు.

– డాక్టర్ బాలకిషన్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్

స్కూల్‌ను బాగు చేశాం



గ్రామస్తులు, దాతల సహకారంతో రూ. 7 లక్షల వరకు కొత్తగా మూడు అదనపు తరగతి గదులు, సౌకర్యాలు ఏర్పాటు చేశాం. గ్రామంలోని యువకులమంతా కలిసి స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీగా ఏర్పడి స్కూల్ అభివృద్ధి పనులకు సహకారం అందిస్తున్నాం.

– కొరంద శ్రీధర్‌రెడ్డి, క్యాసంపల్లి

అందుబాటులో జీలుగ విత్తనాలు



లింగంపేటలో నిలువ ఉన్న జీలుగ విత్తనాలు



మహమ్మద్‌నగర్‌లో విత్తనాలను పంపిణీ చేస్తున్న చైర్మన్

లింగంపేట/ నాగిరెడ్డిపేట: వానాకాలం సీజన్ కోసం జీలుగ(పచ్చిరొట్టె) విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు లింగంపేట మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ ఆదివారం తెలిపారు. మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి, నల్లమడుగు, లింగంపేట సొసైటీల్లో వంద బస్తాల చొప్పున జీలుగ విత్తనాలు నిలువ ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఒక్కో బస్తా 30 కిలోలు 50 శాతం సబ్సిడీతో రూ. 2137.50కు అందిస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు అవసరం ఉన్న రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్సులతో ఏఈవోలను సంప్రదించాలన్నారు. రైతులు సాగు చేసేందుకు అవసరమైన జీలుగ విత్తనాలు సబ్సిడీపై అందించనున్నట్లు నాగిరెడ్డిపేట ఏవో సాయికిరణ్ తెలిపారు. మండలంలోని మాల్తుమ్మెద సొసైటీకి వంద బస్తాలు, తాండూర్ సొసైటీకి వంద బస్తాల చొప్పున మండలానికి మొత్తం సరఫరా అయినట్లు పేర్కొన్నారు. జీలుగ విత్తనాలు అవసరమైన రైతులు వారి పట్టాపాస్ పుస్తకంతోపాటు ఆధార్‌కార్డ్ జిరాక్స్‌లతో సంబంధిత ఏఈవోను సంప్రదించాలన్నారు.

మహమ్మద్‌నగర్‌లో విత్తనాల పంపిణీ

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో జీలుగ విత్తనాలను సొసైటీ చైర్మన్ చేతుల మీదుగా అధికారులు రైతులకు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి నవ్య, ఏఈవో రేణుక, సొసైటీ సీఈవో రాములు, సిబ్బంది సాయి తేజ, భాస్కర్, కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మండుటెండల్లో నీటి ఊటలు

- నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిండిన కుంటలు



యాడారంలో గుట్టపై నుంచి నీటి ఊట వస్తున్న దృశ్యం



వర్షాలకు కుంటలో నిండిన నీరు

బీబీపేట: ప్రతి ఏడాది వేసవిలో గుక్కెడు నీటి కోసం మనుషులతో పాటు పశువులు సైతం అల్లాడిపోతుంటాయి. అలాంటిది ఈ ఏడాదిలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుంటలు నిండిపోయాయి. అంతే కాకుండా వర్షాలు వరుసగా కురవడంతో గుట్టల నుంచి నీటి ఊటలు పారుతున్నాయి. యాడారం గ్రామంలోని గుట్టల్లో నీటి ఊటలు పారుతున్న దృశ్యం సాక్షి కెమెరాకు చిక్కింది. గ్రామాల్లో నీరు నిండడంతో పశువులకు నీటికి ఇబ్బందులు తలెత్తకుండా ఉంది. మండే ఎండల్లో వర్షాలు పడుతుండడంతో వ్యవసాయం చేసే రైతుల్లో కూడా ఆనందం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది పంటలు సైతం ముందుగానే వేసే అవకాశం ఉందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆత్మీయ పలకరింపులు.. మధుర స్మృతులు



దోమకొండలోని ప్రభుత్వ బాలికల పాఠశాల 2005-06 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థినులు



తలమడ్ల జెడ్పీహెచ్ 2000-2001 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



రామారెడ్డి జెడ్పీహెచ్ఎస్ 1997-98 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



అంకాపూర్‌లోని భార్గవి విద్యానికేతన్ పాఠశాల 1998-99 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పలుచోట్ల సమ్మేళనాలు నిర్వహించిన పూర్వవిద్యార్థులు
- ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో భావోద్వేగానికి గురైన చిన్ననాటి మిత్రులు



వన్నెల్(బి) జెడ్పీహెచ్ఎస్ 2004-05 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



అంకాపూర్ జెడ్పీహెచ్ఎస్ 2010-11 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్: ఆత్మీయ పలకరింపులు.. ఆపాత మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. అరే ఎన్నాళ్లయింది కలుసుకుని.. పూర్తిగా మారిపోయావంటూ ఆనాటి స్నేహితులు ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో హర్షం వ్యక్తంచేశారు. జిల్లాలోని వివిధ గ్రామాల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నానాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటూ అనాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకున్నారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి, సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యార్థులు, గురువులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అలాగే బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1995–98 మధ్య చదివిన బీకాం విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.



అడ్లూర్ ఎల్లారెడ్డి జెడ్పీహెచ్ఎస్ 2000-2001 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



మాక్లూర్ జెడ్పీహెచ్ఎస్ 2000-01 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



శక్కర్‌నగర్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1992-95 వరకు చదివిన విద్యార్థులు

భర్త కొట్టడంతో భార్య మృతి

ఖలీల్‌వాడి: కుటుంబ కలహాల కారణంగా భర్త తన భార్యను కొట్టడంతో మృతిచెందిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని ఆర్యనగర్‌కు చెందిన క్యాతరం నిఖిత(30)ను ఆదివారం భర్త నరేష్ కుటుంబ కలహాల కారణంగా కొట్టాడు. ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడటంతో వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. గాయాలతో నిఖిత మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు నాలుగోటౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

దాడి కేసులో ఒకరి రిమాండ్

ఖలీల్‌వాడి: నగరంలోని వర్ని చౌరస్తా వద్ద గల ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో ఇటీవల ఓ వ్యక్తిపై కత్తితో దాడిచేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు రెండో టౌన్ ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు. ఇటీవల మాస్టర్ బిజయ్‌పై నవనాథ్ అనే వ్యక్తి కత్తితో దాడి చేయగా, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నవనాథ్‌ను జడ్జి ముందు హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లో ఆదివారం విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతిచెందాయి. కోటార్మూర్‌లోని జనార్దన్ గౌడ్ అనే పాడి రైతుకు చెందిన నాలుగు గేదెలు ఆదివారం గ్రామ శివారులో మేతకు వెళ్లగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు వాటికి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. సమాచారం అందుకున్న జిల్లా పశువైద్యాధికారి రోహిత్ రెడ్డి, మండల పశువైద్యాధికారి లక్కం ప్రభాకర్ ఘటన స్థలాన్ని సందర్శించారు. సుమారు రెండు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు జనార్దన్ గౌడ్ అధికారులకు తెలిపారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్లు రైతు ఆరోపించారు.

పోచారం తండాలో ఆవు..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని పోచారం తండాలో కరెంట్ షాక్ తగిలి ఆవు మృతి చెందింది. పోచారం తండాలోని విఠల్ నాయక్ చెందిన ఆవు ఆదివారం మేతకు వెళ్లగా సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎలాంటి కంచె నిర్మించకపోవడం వల్లనే ఆవు మృతిచెందినట్లు స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మరకు కంచె నిర్మించాలని, బాధితుడికి నష్ట పరిహారం చెల్లించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

మద్యంమత్తులో వీరంగం

ఖలీల్‌వాడి: నగరంలో పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, ఓ వ్యక్తి మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. సదరు వ్యక్తి బ్రీత్ ఎనలైజ్ చేయడానికి యత్నించిన ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు గాయం అయింది. వివరాలు ఇలా.. నగరంలోని పాలిటెక్నిక్ వాటర్ ట్యాంక్ వద్ద ఆదివారం సాయంత్రం ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. నగరానికి చెందిన గౌతమ్ రెడ్డి మద్యం తాగి బైక్ నడుపుతుండగా పోలీసులు పట్టుకున్నారు. అనంతరం అతడికి బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేయడానికి ట్రాఫిక్ పోలీసులు యత్నించగా సహకరించలేదు. అసభ్య పదజాలంతో సిబ్బందిని దూషించాడు. ఆర్ఎస్సైలు సుమన్, వినోద్‌లు అతడిని సముదాయించినా, మత్తులో రోడ్డుపై పొర్లుతూ హంగామా చేశారు. బ్రీత్ ఎనలైజ్ చేయడానికి వెళ్లిన కానిస్టేబుల్ శేఖర్ బాబు కంటికి గాయం అయింది. దీంతో పోలీసులు మూడో టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు.

హైవేపై ఢీకొన్న లారీలు



డిచ్‌పల్లి: మండలంలోని దేవుపల్లి క్యాంప్ గ్రామం సమీపంలోగల 44వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం రెండు లారీలు ఢీకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. హైదరాబాద్ వైపు నుంచి నాగ్‌పూర్ వైపు రెండు లారీలు బయలుదేరాయి. దేవుపల్లి క్యాంప్ సమీపంలో ముందున్న లారీని వెనుకున్న లారీ ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. దీంతో రహదారిపై చాలా సేపు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు, హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన లారీలను క్రేన్ సాయంతో పక్కకు తొలగించి వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు. రెండు లారీలు ఢీకొన్న సమయంలో వాటిలో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం జరిగిన సమయంలో ఇతర వాహనాలు వాటిని ఢీకొన్నట్లయితే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మొరం ట్రాక్టర్లు, పొక్లెయిన్ సీజ్



నిజాంసాగర్ (జుక్కల్): మండల కేంద్రం శివారులో మొరం తవ్వకాలు చేపడుతున్న పొక్లెయిన్‌ను, మొరం తరలిస్తున్న ట్రాక్టర్లను ఎస్సై శివకుమార్ ఆదివారం పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు చేపడుతూ, రవాణా చేయడంతో వాహనాలను సీజ్ చేసి, స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

విద్యార్థులు మంచి నడవడిక అలవర్చుకోవాలి



నిజామాబాద్‌రూరల్: విద్యార్థులు మంచి నడవడికను అలవరుచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. నగరంలో విద్యార్థులకు గత నెలలో రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేయగా ఆదివారం ముగిసింది. ఈసందర్భంగా గంగాస్థాన్ ఫేజ్–2లోని రామకృష్ణ వివేకానంద ధ్యాన మందిరంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో హాజరై, మాట్లాడారు. రామకృష్ణ సేవా సమితి వేసవి శిక్షణ తరగతులు ప్రతి సంవత్సరం నిర్వహిస్తునందుకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు శిక్షణతోపాటు మహనీయుల బోధనలను అనుసరించాలన్నారు. అనంతరం రెడ్‌క్రాస్‌లో జాతీయ అవార్డు గ్రహీత తోట రాజశేఖర్, ఉపాధ్యాయులను సత్కరించారు. శిక్షణలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సమితి ప్రతినిధులు, ఉపాధ్యాయులు సూర్య ప్రకాష్, సాయి ప్రసాద్, యోగా రాంచందర్, బొమ్మ గోపాల్, తోట రాజశేఖర్, వసంత్ పాటిల్, దీపక్, నాయక్, వినోద్, స్వరూప్, నర్సయ్య, గంగా ప్రసాద్, వినోద్, శ్రీనివాస్, శ్రీలేఖ, రమేష్, హనుమాండ్లు రాజేంద్రప్రసాద్, రాజ్‌కుమార్ సుబేదార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ

కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్ గ్రామంలోగల పెద్దమ్మ ఆలయం, పోచమ్మ ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయాల తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఒక గ్రాము బంగారం, మూడు గ్రాముల వెండి ఆభరణాలు, హుండీలోని నగదును ఎత్తుకెళ్లారు. ముదిరాజ్ సంఘం ప్రతినిధి జెల్ల సదానంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై నరేందర్ తెలిపారు.

అలాగే ఉప్లూర్‌లోని పత్రి రవికి చెందిన బైక్ చోరీకి గురైంది. శనివారం రాత్రి రవి తన బైక్‌ను ఇంటి ముందర నిలిపి, ఇంట్లో నిద్రించాడు. అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు అతడి బైక్‌ను చోరీ చేశారు. అతడు ఉదయం లేచి చూసేసరికి బైక్ కనిపించకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికాడు. అయినా బైక్ ఆచూకీ లభించలేదు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బాధితుడు తెలిపాడు.

కార్పెంటర్ షాపులో ఫారెస్ట్ అధికారుల దాడులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఓ కార్పెంటర్ దుకాణంలో ఆదివారం మధ్యాహ్నం అటవీశాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఫారెస్ట్ సెక్షన్ అధికారి ముబాషేరలి మాట్లాడుతూ.. మండలకేంద్రానికి చెందిన వడ్ల రాజశేఖర్ కార్పెంటర్ దుకాణంలో అక్రమంగా ఎనిమిది టేకు దుంగలను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అతడికి రూ.8వేల జరిమానా విధించినట్లు తెలిపారు. కార్పెంటర్ షాప్ నిర్వాహకులపై కూడా వారం రోజుల్లో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. మండలంలో ఎక్కడైనా ఫారెస్ట్ అధికారుల అనుమతి లేకుండా టేకు కలపతో పనులు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా కలప వ్యాపారం జరిగినట్లు తెలిస్తే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. బీట్ ఆఫీసర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.